## కారును అద్దెకు మాట్లాడుకొని డ్రైవర్‌పై హత్యాయత్నం

- వాహనంతో దంపతుల పరారీ

లింగంపేట, ఆగస్టు 9: ఇంటికి వెళ్లేందుకు కారును అద్దెకు తీసుకొని, కారు డ్రైవర్‌పై హత్యాయత్నం చేసి, వాహనంతో నిందితులు పరారైన ఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కుటుంబ సమేతంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామానికి వచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన గూడవల్లి స్టీఫెన్ ఇన్నోవా కారును అద్దెకు తీసుకున్నాడు. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి కన్నాపూర్ బయల్దేరారు. మార్గమధ్యంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వాహనాన్ని ఆపమన్నారు. దీంతో డ్రైవర్ స్టీఫెన్.. కారును అటవీ ప్రాంతంలో నిలిపాడు. శ్రీకాంత్, అతడి భార్య కలిసి డ్రైవర్ మెడకు చున్నీ చుట్టి చంపడానికి యత్నించారు. డ్రైవర్ స్టీఫెన్ అపస్మారక స్థితికి వెళ్లడంతో అతడిని వదిలేసి, వాహనంలో ఉన్న రెండు సెల్‌ఫోన్లు అపహరించుకొని అదే కారు తీసుకొని పారిపోయారు. తేరుకున్న అతడు లింగంపేట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## న్యూఢిల్లీలో పంద్రాగస్టు వేడుకలకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : న్యూఢిల్లీలో నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం నలుగురు టీయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు దక్కింది. వారిని రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి శుక్రవారం అభినందించి మాట్లాడారు. న్యూఢిల్లీలో నిర్వహించే వేడుకలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కె.విజయశాంతి, ఎ. జ్యోతి (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల – కామారెడ్డి), శివప్రసాద్, సాయిరాం (గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల –నిజామాబాద్) ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త కొండ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారిణి చంద్రకళ, జూనియర్ అసిస్టెంట్ సురేశ్ పాల్గొన్నారు.

## పోలీస్ కస్టడీకి యూనియన్ బ్యాంక్ మేనేజర్

వినాయక్‌నగర్, ఆగస్టు 9 : జిల్లాకేంద్రంలోని పెద్దబజార్ యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల డబ్బులు కాజేసిన కేసులో జైలులో ఉన్న ఆ బ్యాంకు మేనేజర్ అజయ్ కుమార్‌ను కస్టడీకి ఇవ్వాలని నగర సీఐ నరహరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో సీఐ అభ్యర్థన మేరకు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిందితుడిని పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ నిజామాబాద్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (మొబైల్) చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. అయితే విచారణ సమయంలో నిందితుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని మేజిస్ట్రేట్ పోలీసులను ఆదేశించారు.

## ప్రధానమంత్రి బాల్ పురస్కార్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్, ఆగస్టు 9 : ధైర్య సాహసాలను ప్రదర్శించి, ఆపదలో ఉన్న బాల బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రధానమంత్రి బాల్ పురస్కార్– 2025 అవార్డు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభా పాటవాలు, ఆటలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహసాలు తదితర అంశాల్లో అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపారు. అర్హులు https://awards. gov.in ద్వారా ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, ఆగస్టు9: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గుతూ వస్తున్నది. శుక్రవారం వరకు ప్రాజెక్ట్‌లోకి 3793 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5 టీఎంసీలు) కాగా శుక్రవారం 1080.8 అడుగులు (47.25టీఎంసీలు) నీటినిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి 3793 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 3వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 10క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 50క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 502 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.



*బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాకాండకు నిరసనగా ముప్కాల్ మండలకేంద్రంలో యువకులు, వివిధ పార్టీలు, కులసంఘాల నాయకులు శుక్రవారం కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. హిందువులను రక్షించాలంటూ నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌లో మృతిచెందిన హిందువులకు నివాళులర్పించారు.*

*– ముప్కాల్, ఆగస్టు9*

















